క్లుప్తంగా

బాబూ జగ్జీవన్ రాం భవనానికి స్థల కేటాయింపునకు వినతి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న మాదిగ సంక్షేమ సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం భవనానికి అనుమతులు, స్థలం కేటాయించాలని విశాఖ జిల్లా మాదిగ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి అమర్‌నాథ్‌ను కోరారు. మిందిలో సోమవారం మంత్రిని కలిసిన వారు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సంఘం ప్రతినిధులు కొప్పుల వెంకటరావు, రాయి అప్పారావు, ఈశ్వర రావు, గొటివాడ నర్సింగరావు, ఉప్పాటి ప్రవీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు రామారావు

పెదగంట్యాడ: మండలంలోని చేపలమార్కెట్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. న్యూపోర్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడలో ఒంటరిగా నివాసం ఉండే రామారావు (56) నిత్యం మద్యం సేవిస్తూ, రోడ్లపై తిరుగుతూ ఉండేవారు. సోమవారం మధ్యాహ్నం మద్యం సేవించి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గుర్తించి, న్యూ పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అతిగా మద్యం సేవించడం వల్ల గానీ, వడదెబ్బకు గానీ మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన



మేళాలో అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రతినిధి

పెదగంట్యాడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన లభించింది. మేళాను ఐఎంసీ చైర్మన్ ఏకే బాలాజీ ప్రారంభించారు. ఈ మేళాకు 19 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. 182 మంది అభ్యర్థులు ఈ మేళాకు హాజరు కాగా, అందులో 71 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో ముగ్గురు మహిళా అభ్యర్థులు ఉన్నారన్నారు. విసూవిఎస్ ఇండియా లిమిటెడ్, మైలాన్ లాబొరేటరీస్, సినర్జీస్ అండ్ కాస్టింగ్‌కు ఎక్కువమంది ఎంపికయ్యారని పేర్కొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

విద్యా కానుక.. విద్యార్థుల వేడుక

- బడి తెరిచిన మొదటి రోజే కిట్ల అందజేత
- కళకళలాడిన ప్రభుత్వ పాఠశాలలు



గాజువాక ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు విద్యా కానుక కిట్లను అందజేస్తున్న దృశ్యం



66వ వార్డులో విద్యాకానుక అందిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్



నడుపూరు జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక అందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు

గాజువాక: వేసవి సెలవుల తరువాత పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. సుమారు 45 రోజులపాటు సెలవుల తరువాత తరగతి గదుల్లో సందడి చోటుచేసుకుంది. ఇదే సమయంలో పలువురు ఉపాధ్యాయులు బదిలీ కావడం, వారి స్థానంలో బాధ్యతలు స్వీకరించిన కొత్త ఉపాధ్యాయులు విద్యార్థులను పరిచయం చేసుకోవడం వంటి కార్యక్రమాలతో పాఠశాలల్లో వాతావరణం సందడిగా మారింది. ఇప్పటికే చదుతున్న విద్యార్థులతోపాటు కొత్తగా చేరిన విద్యార్థులకు కూడా ప్రభుత్వం జగనన్న విద్యా కానుక కిట్లను అందించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలు తెరవకముందే విద్యార్థులకు కిట్లను అందించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు గాజువాక నియోజకవర్గంలోని పాఠశాలల విద్యార్థుల కోసం 12,131 కిట్లను ముందుగానే సిద్ధం చేశారు. పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా హాజరైన సుమారు 2300 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. గాజువాక మండలంలో 48 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం 7,486 కిట్లు, పెదగంట్యాడ మండలంలోని 37 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం 4,645 కిట్లు విద్యార్థులకు అందించనున్నామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా పాఠశాలలకు..

అక్కిరెడ్డిపాలెం: వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు బయల్దేరారు. 68వ వార్డు మింది, అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం సందడి నెలకొంది. మొదటి రోజునే 70 శాతం వరకు విద్యార్థులు తరగతులకు హాజరయ్యారని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం తెలిపారు.

- 65వ వార్డు రాజీవ్‌మార్గ్, భానోజీ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని బి.వి.నాగమణి, నాయకులు పెద్దింటి మంగునాయుడు, గూన శ్రీనివాసరావు, జన సతీష్, ఎల్.వి.రమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- 66వ వార్డు ఇందిరా కాలనీ ప్రాథమిక పాఠశాలలో జేవీకే కిట్లను కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ అందజేశారు. ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి తపన పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొయిద్దీన్, నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, షేక్ ఆశ, దేముడుబాబు, లక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని సంజీవ్ కాలనీ, బాపూజీ కాలనీల్లో ప్రాథమిక పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారీ బడులను తీర్చిదిద్దడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన బ్యాగ్‌లు, పుస్తకాలు, బూట్లు, యూనిఫాంలు, బెల్ట్‌లు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారని వివరించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్‌వీ ప్రభాకర్, వి.దేవానందబాబు, పెద్దింటి మంగునాయుడు, గూన శ్రీనివాసరావు, జాన సతీష్, ఎల్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

- 77వ వార్డు ఇస్లాం పేట జెడ్పీ హైస్కూల్లో జేవీకే కిట్లను కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం జి.ప్రమీల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.
- నడుపూరు జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ జగనన్న విద్యా కానుకను పంపిణీ చేశారు.



65వ వార్డులో జేవీకే కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహ పాత్రుడు



పినమడక హైస్కూల్‌లో కిట్లు పంపిణీ చేస్తున్న కమిటీ చైర్మన్, హెచ్‌ఎం

సంస్కరణలతో చక్కని ఫలితాలు

అగనంపూడి: విద్యారంగంపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని గ్రహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అత్యుత్తమ ఫలితాలు సాధించడం దీనికి తార్కాణమన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు, కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి శ్రీను, దాసరి సత్యవేణి, సింగిడి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

- 85వ వార్డులోని పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేవీకే కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొయ్య వెంకటరావు, హెచ్‌ఎం వై.భీమశంకరావు, లయన్స్ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతరావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, చందక శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



65వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

థాంక్యూ జగన్ మామయ్య



మాకు స్కూల్ తెరవగానే పుస్తకాలు, బ్యాగ్, షూ అన్నీ ఇచ్చారు. ముందు నుంచి పుస్తకాలు ఉంటే చదవడానికి బాగా ఉంటుంది. యూనిఫాం, బ్యాగ్ అన్నీ కొత్తవి. హ్యాపీగా ఉంది. థాంక్యూ జగన్ మామయ్యా.

–బంక శ్రావణి ప్రియ, 8వ తరగతి, యారాడ జెడ్పీ హైస్కూల్

నేరుగా పాఠశాలలకే కిట్లు



గతంలో పాఠశాలలు పునః ప్రారంభమై నెల రోజులు గడిచినా పుస్తకాలు వచ్చేవి కావు. వాటిని ఎమ్మార్సీ కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోవడం వ్యయప్రయాసలతో కూడి ఉండేది. ఇప్పుడు నేరుగా పాఠశాలలకే జగనన్న విద్యా కానుకతో పాటు పుస్తకాలు అందజేయడం బాగుంది.

– జి.సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం, యారాడ జెడ్పీ హైస్కూల్

నిరుపేదలకు పింఛన్ల పంపిణీ



నిరుపేదలకు పింఛన్లు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 75 మంది నిరుపేద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఫించన్లు పంపిణీ చేశారు. ప్రతీ నెల 75 మంది అర్హులకు నెలకు రూ.2 వందలతో పాటు రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు. రాలేని వారి ఇళ్లకు వెళ్లి సొమ్మును అందిస్తున్నారు. ట్రస్ట్ ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పింఛన్లతో పాటు హల్క్ తందూరి అధినేత పిళ్లా సత్యనారాయణ ఆర్థిక సహకారంతో నాన్‌వెజ్ బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, జామి గణేష్, పొన్నగంటి కొండలరావు, గుదే సుశీలా గజేంద్రరావు, పట్టా రామ అప్పారావు, శీరంశెట్టి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక




కేంద్రమంత్రితో గాజువాక బీజేపీ నాయకులు

గాజువాక: కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ రాజన్ సింగ్‌ను గాజువాక బీజేపీ నాయకులు సోమవారం కలిశారు. కేంద్ర మంత్రి ఢిల్లీ నుంచి విశాఖ వచ్చిన సందర్భంగా ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు విశాఖ ఎయిర్‌పోర్టులో కలిసి, స్వాగతం పలికారు. గాజువాకలో తాము నిర్వహిస్తున్న కార్యక్రమాలను, కేంద్ర ప్రథకాలపై చేపట్టిన ప్రచారాన్ని ఆయనకు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు బాలరాజేశ్వర రావు, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, పేర్ల అప్పారావు, రాజశేఖర్ తదితరులున్నారు.

హెచ్‌టీ లైన్లకు తగిలిన కేబుల్ వైర్లు

మూడిళ్లలో విద్యుత్ సామగ్రి దగ్ధం



కాలిపోయిన స్విచ్ బోర్డు



దగ్ధమైన విద్యుత్ మీటరు

గాజువాక: గాజువాక దరి డ్రైవర్స్ కాలనీలో హెచ్‌టీ లైన్లకు కేబుల్ వైర్లు తగలడంతో మూడు ఇళ్లలోని విద్యుత్ సామగ్రి కాలిపోయింది. వివరాలివి.. కాలనీలో రాజు అనే కేబుల్ వర్కర్ కేబుల్ వైర్లు లాగుతుండగా వైరు హెచ్‌టీ లైన్‌కు తాకింది. దీంతో రాజు ఒక్కసారిగా పక్కకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో మూడు ఇళ్లలోని వైరింగ్ పూర్తిగా కాలిపోయింది. ఫ్రిజ్‌లు, టీవీలు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు దగ్ధమయ్యాయి. రాజుకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

సైకిల్ రైడర్ సంపత్‌కు అభినందనలు

సీతంపేట: 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ సరిహద్దుల వరకు సైకిల్ యాత్ర చేపట్టిన బుల్లయ్య కళాశాల విద్యార్థి సాయి సంపత్ ఈ నెల 2న విశాఖ చేరుకున్నాడు. యాత్ర విజయవంతంగా పూర్తి చేసిన సంపత్ సోమవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన సంపత్‌ను అభినందించి యాత్రా విశేషాలను అడిగి తెలుసుకున్నారు. సైకిల్‌పై మే 8న విశాఖలో యాత్ర ప్రారంభించి 25 రోజుల పాటు సుమారు 2 వేల కిలోమీటర్లు ప్రయాణించి బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ సరిహద్దుల వరకు యాత్ర సాగించినట్టు తెలిపాడు. రుకున్న చిన్న వయస్కుడిగా రికార్డు సాధించానని చెప్పాడు.

కొత్త అడ్మిషన్లకు క్యూ



గాజువాక హైస్కూల్‌లో అడ్మిషన్లకు క్యూ లైన్

గాజువాక: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు విద్యార్థులు క్యూ కట్టారు. పలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో పలువురు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపించగా, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తి చేసిన చిన్నారులు ఆరో తరగతిలో చేరేందుకు హైస్కూళ్ల వద్ద బారులు తీరారు. ఈ సందర్భంగా గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద విద్యార్థుల అడ్మిషన్ల కోసం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాల తెరిచిన మొదటి గంటలోనే 25 మంది విద్యార్థులు చేరినట్టు ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతి తెలిపారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువుదీరిన కనక మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

వైభవంగా ఎర్నిమాంబ ఆలయ పునఃప్రారంభం



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సుబ్బారెడ్డి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలోని ఎర్నిమాంబ ఆలయ పునఃప్రారంభం సోమవారం ఘనంగా జరిగింది. విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులు రూ. 35లక్షల తో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయనకు ఆలయ ఈవో డి.వెంకట సత్యసురేష్ బాబా, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బెహరా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



స్టీల్‌ప్లాంట్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతంరెడ్డి పిలుపు మేరకు సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి నాలుగేళ్లలో ప్రతీ సామాజిక వర్గానికి లబ్ధి చేకూరేలా అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పేద, బడుగు, బలహీన, మైనార్టీ, మహిళల సంక్షేమంతో పాటు పాలనలో అన్ని వర్గాల వారిని భాగస్వాములను చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో మార్డు పూడి పరదేశి, ఎన్నేటి రమణ, పిట్టారెడ్డి, అండిబోయిన అప్పారావు, బి.వి.రామయ్య, నమ్మి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి సత్కారం



వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న అగ్నికుల క్షత్రియ సంఘం ప్రతినిధులు

పెదగంట్యాడ: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని విశాఖ జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం ప్రతినిధులు నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అంగ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో తమ సామాజిక వర్గానికి అవసరమైన భవనం నిర్మించుకునేందుకు సుమారు 1000 చదరపు గజాల స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి సమ్మిడి ఆనందరావు, నాగేటి లలితా నారాయణమూర్తి, సమ్మిడి అప్పలరాజు, కటాడ సంతోష్ పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు' చెక్కుల అందజేత



చెక్కులు అందుకున్న విద్యార్థులతో కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి: ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం సత్కరిస్తోంది. ఇందులో భాగంగా 85వ వార్డు అగనంపూడి జెడ్పీ హైస్కూల్లో పాఠశాల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన షేక్ షబీర్ మొహిద్దీన్, దాసరి పూర్ణ పూజిత, పెరుగు నాగమణికి వెయ్యి రూపాయల చొప్పున చెక్కులు అందించి, సత్కరించారు. కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, హెచ్‌ఎం కృష్ణారావు, కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, ప్రతినిధులు శ్రీను, సత్యవేణి పిళ్లా రవి, సింగిడి సింహాచలం పాల్గొన్నారు.

'ప్రజల ఆకాంక్షకు కేంద్ర ప్రభుత్వం విలువివ్వాలి'

కూర్మన్నపాలెం: రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. ప్రజల ఆకాంక్షకు కేంద్ర ప్రభుత్వం విలువనిచ్చి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా పార్లమెంట్‌లో ప్రకటన చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 851వ రోజు, సోమవారం వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు ఉక్కు కర్మాగారం గురించి పోరాడుతున్నా ప్రధాని మోదీ ఈ విషయం ప్రస్తావించకపోవడం సరికాదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారులకు పదోన్నతులు కల్పించాలి



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం గాంధీను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులకు పదోన్నతులు కల్పించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సంస్థ హెచ్‌ఆర్ సీజీఎం జి. గాంధీని కోరారు. హెచ్‌ఆర్ సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం అసోసియేషన్ నాయకులు ఉక్కు పరిపాలన భవనంలో ఆయనను కలిసి, అభినందించారు. వారు మాట్లాడుతూ జేవో నుంచి ఏఈ పదోన్నతులు కొంతమందికి ఐదేళ్లు బదులు ఆరేళ్లకు ఇచ్చారన్నారు. ఈ అంశాన్ని నాటి జాతీయ ఎస్టీ కమిషన్ నందకుమార్ సాయి దృష్టికి తీసుకురాగా వారి ఆదేశాలతో మాజీ సీఎండీ, పర్సనల్ డైరెక్టర్లు తదుపరి పదోన్నతుల్లో నష్టాన్ని భర్తీ చేయడానికి అంగీకరించారన్నారు. నాలుగేళ్లుగా అధికారులకు పదోన్నతులు లేకపోవడం వల్ల సీజీఎం స్థాయిలో ఒక్క ఎస్టీ, ఎస్టీ అధికారి కూడా లేరన్నారు. చార్జిమెన్ నుంచి జేవో పదోన్నతుల కోసం వెంటనే పరీక్ష నిర్వహించాలని, వరల్డ్ ట్రైబల్ డేను యాజమాన్యం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి.తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎస్. సత్యనారాయణ, ఎల్.వి. రమణ, ఎస్. మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మనసుకు ఆనందాన్నిచ్చేది కవిత్వం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామితో కవులు, రచయితలు

సీతంపేట: కవిత్వం వింటే మనసుకు ఆనందం కలగాలని లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠం దర్బారు హాల్లో సోమవారం సాయంత్రం కవి సమ్మేళనం జరిగింది. అనంతరం కవులు, రచయితలను ఉద్దేశించి స్వామి వారు అనుగ్రహ భాషణం చేశారు. ఆనందం అంటే మనసు పరవశించే స్థితని పేర్కొన్నారు. అందరి ఆనందాల కంటే బ్రహ్మానందం గొప్పదని, కవిత్వం, సంగీతం, లలిత కళల వల్ల కలిగే ఆనందం ఇంచుమించు బ్రహ్మానందంతో సమానమన్నారు. మనిషి ఎన్ని క్షణాలు ఆనందాన్ని అనుభవించాడో అదే నిజమైన జీవితమని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చక్కని పద్య, గద్య కవిత్వంతో అలరించారన్నారు. ఆగస్ట్ 10న లలితా పీఠంలో నన్నయ్య సహస్రాబ్ది ఉత్సవాలు జరుపుకుందామని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మహాస్వామిని, రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, టి.పి.ఎస్.ఆచార్యులు, శేఖరమంత్రి ప్రభాకర్, చింతా ప్రభాకరరావు, రామతాత, చిన సూర్యనారాయణ, కావ్య, పిళ్లా రమణమూర్తి, కొల్లేపల్లి వరలక్ష్మి, మరడాన సుబ్బారావు, కోరాడ నరసింహారావు, పద్మజ, ఎం.విజయగోపాల్, వేదుల కామేశ్వర శర్మ, గుండాన జోగారావు, సుజాతమూర్తి పాల్గొన్నారు.